సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 25 । డిసెంబర్ । 2023



ఊరంతా.. ఊటలే!

నంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల ముంపు బాధితులకు మరో ముప్పు వచ్చింది.

వివరాలు 8లో ▸



సంక్రాంతికి స్పెషల్

సంక్రాంతి పండుగ కోసం రీజియన్ పరిధిలో 420 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /11.2

వాతావరణం

చలి తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా దామోదర రాజనర్సింహ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాంరెడ్డిగూడెం ఎస్సీ గురుకుల ప్రిన్సిపల్ భవాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో వచ్చేనెల 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు తరలిన అథ్లెటిక్స్ జట్టు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పీయూ అథ్లెటిక్స్ మహిళా జట్టు ఆదివారం తరలివెళ్లింది. ఈ మేరకు జట్టు సభ్యులకు పీయూ పీడీ శ్రీనివాస్ ట్రాక్‌సూట్‌లను అందజేశారు. భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం నుంచి జరగనున్న పోటీల్లో జట్టు పాల్గొననుంది. కార్యక్రమంలో కోచ్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

అద్దె వసూళ్లలో.. వెనుకంజ



న్యూటౌన్ లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఇదే..

- పాలమూరు పట్టణంలో 258 మున్సిపల్ షాపులు
- రూ.కోట్లలో పేరుకుపోయిన మొండి బకాయిలు
- పట్టించుకోని పాలకవర్గం, మున్సిపల్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దె బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) ముగియడానికి ఇంకా మూడు నెలల సమయమే ఉంది. ఎప్పటికప్పుడు ఈ అద్దెలు వసూలు చేయడంలో పాలకవర్గంతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా భావించిన దుకాణ యజమానులు అద్దె ఎప్పుడైనా చెల్లించవచ్చులేనని బేఫికర్‌గా ఉన్నారు. కొందరైతే ఏకంగా ఆయా దుకాణాలకు సెల్ఫ్ లాక్ వేసి ఏళ్లతరబడి మూసేసినా అడిగే దిక్కు లేకుండా పోయింది. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

పట్టణంలో 258 దుకాణాలు

జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద సుమారు 35 ఏళ్ల క్రితం 41 దుకాణాలను, 25 ఏళ్ల క్రితం మార్కెట్ ఏరియాలో 47, 15 ఏళ్ల క్రితం ఎనుగొండలో మూడు దుకాణాలను మున్సిపల్ అధికారులు నిర్మించారు. అలాగే 15 ఏళ్ల క్రితం న్యూటౌన్‌లో ఐడీఎస్‌ఎంటీ కింద 98, 20 ఏళ్ల క్రితం క్లాక్‌టవర్ వద్ద 17, 35 ఏళ్ల క్రితం మార్కెట్ ఏరియాలో 15, సుమారు 15 ఏళ్ల క్రితం కొత్తబస్టాండ్ సమీపంలో 18, పద్మావతికాలనీలో 11, టీడీగుట్ట ప్రాంతంలో ఎనిమిది చొప్పున దుకాణాలను నిర్మించారు. ఇలా తొమ్మిది చోట్ల మున్సిపల్ షాపులు మొత్తం 258 ఉన్నాయి. వీటిలో 65 దుకాణాలకు కిరాయిదారులు కొన్నేళ్లుగా సెల్ఫ్ లాక్ వేసుకుని అద్దె చెల్లించడం లేదు. మరోవైపు కరోనా సమయంలో ఏడాదిన్నర పాటు వ్యాపారం సరిగా నడవక చాలా మంది వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కొందరు నష్టాలు చవిచూడగా, మరికొందరు తమ షాపులను ఇప్పటివరకు తెరవకపోవడం గమనార్హం. పట్టణంలోని ఈ షాపులకు ఒక్కోదానికి నెలకు కనిష్టంగా రూ.1,200 నుంచి గరిష్టంగా రూ.18 వేల వరకు కిరాయి రావాల్సి ఉంది. కాగా, ఇటీవల కొత్తగా గెలిచిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి న్యూటౌన్‌లోని ఐడీఎస్‌ఎంటీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. మూసివేసిన షాపులను వెంటనే తెరిపించాలని ఆదేశించారు. దీంతో ఏఎంసీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో అక్కడి 15 దుకాణాల తాళాలను మున్సిపల్ సిబ్బందితో పగులగొట్టి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. ఎట్టకేలకు వివిధ ప్రాంతాల్లోని మొత్తం 36 దుకాణాలకు త్వరలోనే వేలం పాటలు నిర్వహించనున్నారు. ఇందుకు గాను ఈనెల 22న నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో వాటికి కౌన్సిల్ ఆమోదం పొందారు.



క్లాక్‌టవర్ వద్ద మొదటి అంతస్తులో ఖాళీగా ఉన్న మున్సిపల్ దుకాణాలు

ఈ ఏడాది 5.53 శాతమే వసూలు..

2023–24కు గాను మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి మొత్తం రూ.52,15,298 రావచ్చని అధికారులు అంచనా వేశారు. ఇక పాత బకాయిల కింద ఏకంగా రూ.17,89,39,109 పెండింగ్‌లో ఉండగా ఇలా మొత్తం రూ.18,41,54,367 రావాలి. అయితే ఇప్పటి వరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేవలం రూ.7,96,333 మాత్రమే వసూలు చేయగలిగారు. అలాగే పాత బకాయిల కింద రూ.93,96,302 రాగా మొత్తం రూ.1,01,92,635 మాత్రమే (5.53 శాతం) రాబట్టగలిగారు. ఈ గణాంకాలకు పరిశీలిస్తే మున్సిపల్ అధికారులు, సిబ్బంది పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



పట్టణంలోని మున్సిపల్ దుకాణాల అద్దెను వసూలు చేయడానికి త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఎవరైనా చెల్లించకుంటే తగు చర్యలు తీసుకుంటాం. ఇక క్లాక్‌టవర్ వద్ద పైకప్పు పెచ్చులూడి దెబ్బతిన్న షాపులకు మరమ్మతు చేయిస్తాం.

– డి.ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్



క్రిస్మస్ పర్వదినానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యుత్ దీపాల అలంకరణలో చర్చిలన్నీ విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. సోమవారం క్రీస్తు జన్మదినాన్ని జిల్లావ్యాప్తంగా జరుపుకోనున్నారు. ఆదివారం అర్ధరాత్రి పలు చర్చిలలో కేకులు కట్ చేసి.. పండుగకు స్వాగతం పలికారు. సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్

పీయూలో ఉర్దూ దూరవిద్య



- మౌలానా ఆజాద్ యూనివర్సిటీతో ఒప్పందం
- ఓపెన్ విధానంలో బీఏ, బీకాం, డిప్లొమా కోర్సులకు అవకాశం
- ఇప్పటికే లర్నర్ సపోర్ట్ సెంటర్ ప్రారంభించిన అధికారులు
- ఇక్కడే కౌన్సిలింగ్ తరగతులు, అసైన్‌మెంట్, పరీక్షల నిర్వహణ
- జనవరి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఇప్పటి వరకు సాధారణ కోర్సులు మాత్రమే ఉండేవి. కానీ, ఇప్పుడు ఓపెన్ విధానంలో ఉర్దూ మీడియంలో ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం పీయూ అధికారులు మౌలానా ఆజాద్ యూనివర్సిటీతో గత ఆగస్టులో ఎంఓయూ (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్) చేసుకున్నారు. యూనివర్సిటీలో వసతులు పరిశీలించిన అనంతరం పీయూలో ఇటీవల ఎల్‌సీఎస్ సెంటర్ (లర్నర్ సపోర్ట్ సెంటర్)ను అధికారులు ప్రారంభించారు. దీని ద్వారా ఉర్దూ చదువుకునే విద్యార్థులకు ఎంతో మేలు జరగనుంది. ఈ జనవరి నుంచి కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించే అవకాశం ఉంది. సుమారు 50 నుంచి 100 మంది అడ్మిషన్లు పొందవచ్చు.

అందుబాటులో ఉన్న కోర్సులు

ఓపెన్ విధానంలో ఉర్దూ మీడియంలో యూజీ, పీజీ కోర్సులు చదివే వారికి మౌలానా యూనివర్సిటీ వివిధ కోర్సులు అందిస్తుంది. పీజీలో ఎంఏ ఉర్దూ, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ ఇస్లామిక్ స్టడీస్, ఎంఏ హిస్టరీ, అరబిక్, హిందీ యూజీలో బీఏ, బీకాం వంటి కోర్సులు ఉన్నాయి. ఇక డిప్లొమాలో పలు సర్టిఫికెట్ కోర్సులు అందించనున్నారు. అయితే వీటిని నేరుగా మౌలానా యూనివర్సిటీలో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అక్కడ జాబితాను యూనివర్సిటీ పీయూలోని ఎల్‌సీఎస్ సెంటర్‌కు పంపిస్తే.. దానిని బట్టి ఇక్కడ విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తారు. గత నెల మొదట్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కాగా.. వచ్చే నెలలో అడ్మిషన్లు తీసుకున్న వారికి ఇక్కడ తరగతులు నిర్వహించనున్నారు.

ఆసక్తి గలవారికి..



ఉమ్మడి జిల్లాలో ఉర్దూ మీడియంలో వివిధ కోర్సులు చదువుకునే వారికి ప్రత్యేకంగా ఒక సెంటర్ ఉండాలన్న ఉద్దేశంతో మౌలానా యూనివర్సిటీని సంప్రదించగా ఓపెన్ విధానంలో చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఎంఓయూ చేసుకుని ఇక్కడ లర్నింగ్ సెంటర్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా ఆసక్తిగల వారు చదువుకునేందుకు మంచి అవకాశం లభిస్తుంది.

– లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ వైస్ చాన్స్‌లర్

విద్యార్థులకు ఎంతో మేలు..



ఉర్దూ చదువుకునే విద్యార్థులకు మౌలానా యూనివర్సిటీ ఒప్పందం ద్వారా ఓపెన్ డిగ్రీ చదువుకునే వారికి అవకాశం కల్పించడం గొప్ప విషయం. ఇక్కడ విద్యార్థులకు కౌన్సిలింగ్ తరగతులు, పరీక్షల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపడతాం. ఉర్దూ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– బషీర్ అహ్మద్, ఎల్‌ఎస్‌సీ కోఆర్డినేటర్, పీయూ

ఎంఈడీ భవనంలో..

పాలమూరు యూనివర్సిటీలోని ఎంఈడీ భవనంలో ప్రత్యేక గదిని కేటాయించారు. కళాశాల ప్రిన్సిపల్‌ను కోఆర్డినేటర్‌గా నియమించారు. ఇక్కడ అడ్మిషన్లు తీసుకున్న వారి కోసం ఓపెన్ డిగ్రీ కౌన్సిలింగ్ తరగతులు నిర్వహించనున్నారు. దీంతోపాటు అసైన్‌మెంట్లు, రికార్డుల పరిశీలన చేయనున్నారు. అంతేకాకుండా ఇక్కడే విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు కూడా జరిపిస్తారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉర్దూ చదువుకోవాలనుకునే విద్యార్థులకు యూనివర్సిటీ ఒక మంచి వేదిక కానుంది. దీన్ని తీసుకువచ్చేందుకు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పలుమార్లు మౌలానా యూనివర్సిటీ అధికారులతో చర్చించి ఈ సెంటర్‌ను తీసుకురావడం పట్ల పలు విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రాణాలు తీసిన అతివేగం

167 నంబర్ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

అనారోగ్యానికి గురైన భార్యకు వైద్యం చేయించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా ముగ్గురు.. ఉద్యోగరీత్యా బదిలీ అయిన ప్రాంతానికి వెళ్తున్న మరో ఇద్దరి ప్రాణాలు మధ్యలోనే అనంతవాయువులో కలిసిపోయాయి. ఎదురెదురుగా రెండు కార్లు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో ఓ కుటుంబంలో భార్యాభర్తతోపాటు మరో బంధువు.. ఇంకో కుటుంబంలో భార్య, కూతురు మృత్యువాతపడిన సంఘటన ఆ రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి.



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన రెండు కార్లు

- ఎదురెదురుగా కార్లు ఢీకొన్న ఘటనలో ఐదుగురి దుర్మరణం
- వైద్యం చేసుకుని వెళ్తూ ఒకరు.. ఉద్యోగంలో చేరేందుకు వెళ్తూ మరొకరు
- బాధితులు కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తింపు
- రెండు కుటుంబాల్లో విషాదం నింపిన ఘటన

మక్తల్: నిర్లక్ష్యంతో కూడిన డ్రైవింగ్ ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. అతివేగం ఫలితంగా జాతీయ రహదారిపై రక్తపుటేరులు పారాయి. ఆదివారం సాయంత్రం నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్ శివారులో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాన్ని చూస్తే ఈ విషయాన్నే ఎత్తిచూపుతున్నాయి. కర్ణాటక రాష్ట్రం సైదాపూర్ గ్రామానికి చెందిన మౌలాలి(43), భార్య రెహమాన్‌బేగం(40) అనారోగ్యానికి గురవడంతో మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని సంకలమద్దిలో చికిత్స చేయించారు. తిరిగి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్లేందుకు సమీప బంధువు ఖలీల్(43), మరో వ్యక్తి వడివాల్‌తో కలిసి కారులో బయలుదేరారు. ఇదిలా ఉండగా.. కర్ణాటక రాష్ట్రంలోని కార్వాల్‌లో పనిచేస్తున్న నేవీ ఉద్యోగి దీపక్ సమల్‌కు విశాఖపట్నానికి బదిలీ అయ్యింది. దీంతో భార్య భవిత సమల్(35), కూతురు అవిస్మిత సమల్(8)తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి అక్కడి నుంచి విశాఖపట్నం వెళ్తామని బంధువులకు సమాచారం ఇచ్చి బయలుదేరారు.

డివైడర్ లేకపోవడంతో..

నేషనల్ హైవే–167కు మధ్యలో డివైడర్ లేదు. దీంతో వాహనదారులు ఓవర్‌టెక్ చేసే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే జక్లేర్ సమీపంలో వేగంగా వచ్చిన రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఐదుగురు మౌలాలి, రెహమాన్‌బేగం, ఖలీల్, భవిత సమల్, అవిస్మిత సమల్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వెంటనే బాటసారులు పోలీసులకు సమాచారం అందించి సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు వచ్చి గాయపడిన వడివాల్, దీపక్ సమల్‌తోపాటు.. ఐదుగురి మృతదేహాలను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో దీపక్ సమల్ పరిస్థితి విషమించడంతో 108లో మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. అయితే నేవీ ఉద్యోగి దీపక్‌ది ఒడిశా రాష్ట్రంగా గుర్తించారు.

అమ్మా.. ఎక్కడ ఉన్నావ్..

మక్తల్ మండలం జక్లేర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లలోనూ బెలూన్ లేకపోవడంతో ప్రమాద తీవ్రత పెంచిందని స్థానికులు చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో అవిస్మిత 'అమ్మా.. ఎక్కడ ఉన్నావ్' అంటూ బోరున విలపించి అక్కడికక్కడే మృతిచెందిందని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. నీళ్లు తాగించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ

- 28 నుంచి గ్రామ, వార్డు సభలు
- కలెక్టర్ రవినాయక్



హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రవినాయక్ వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం అనంతరం ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేకాధికారి, మండలాలకు ప్రత్యేకాలను నియమించనున్నట్లు తెలిపారు. రోజు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డులలో సభలు నిర్వహించి, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. ముందుగానే ఇంటికో దరఖాస్తు చొప్పున ఇవ్వాలని, ఆరు గ్యారంటీలకు సంబంధించి లబ్ధిదారుకు ఏం అవసరం ఉందో దరఖాస్తులో నింపి సిద్ధంగా ఉంచుకునేలా చూడాలన్నారు. అభ్యర్థుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను డిజిటలైజ్ చేయడంతో పాటు రశీదు ఇవ్వాలని తెలిపారు. గ్రామసభ ముగిసిన తర్వాత ఇంకా దరఖాస్తు సమర్పించే వారు ఉంటే పంచాయతీ కార్యదర్శి స్వీకరించాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ అధ్యక్షతన ఒక బృందాన్ని, ఎంపీడీఓ అధ్యక్షతన మరో బృందాన్ని ఏర్పాటు చేయాలని.. మండలాల్లో ఎక్కువ గ్రామపంచాయతీలు ఉంటే, అందుకు అనుగుణంగా బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి టీమ్‌లో 8 నుంచి 10 మంది సిబ్బందిని నియమించాలని, 8నుంచి 10 కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఈనెల 25న మధ్యాహ్నం 12 గంటలలోగా షెడ్యూల్ సమర్పించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సభల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ వద్ద ప్రాథమిక చికిత్స శిబిరం ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. వీసీలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

నవాబుపేట మార్కెట్‌కు భారీగా ధాన్యం



నవాబుపేట: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ధాన్యం రాశులతో కళకళలాడింది. ఆదివారం 47 వేల బస్తాలకు పైగా ధాన్యం రావడంతో యార్డు మొత్తం ధాన్యంతో కిక్కిరిసింది. కాగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కంటే మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధర వేస్తుండటంతో రైతులందరూ మార్కెట్‌కు ధాన్యం తీసుకువస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం వరిధాన్యం క్వింటా రూ.3,420 ధర పలికింది.

ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్



మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని నిజాం క్లబ్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగగా ఉపాధ్యక్షుడిగా ఎన్‌పీ వెంకటేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన మూడోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడం విశేషం. ఎన్‌పీ వెంకటేశ్ ఎన్నికపై జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భానుకిరణ్, సభ్యులు రంగారావు, రమేష్, శంకర్‌లింగం, గజానంద్, నందకిషోర్, నాగేష్, ఇమ్మాన్యుయేల్ జేమ్స్, రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

పాలమూరు 'పంచగిరి'



- సువిశాలమైన ఆహ్లాదకర వాతావరణంలో అయ్యప్పక్షేత్రం
- 500 అడుగుల ఎత్తులో మణికంఠుడి ఆలయం
- ఉమ్మడి జిల్లాకే తలమానికం

- వివరాలు 10లో..

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: తెలంగాణ ఉద్యమకారుల హక్కుల వేదిక కార్యవర్గం ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా ఆవరణలో ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో ఎన్నుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్‌గా టీజీ కృష్ణ ముదిరాజ్, కోకన్వీనర్లుగా మోసిన్‌ఖాన్, శివన్న, గోపాలకృష్ణ, కన్వీనర్‌గా వెంకటేష్‌తోపాటు వనపర్తి జిల్లా కన్వీనర్‌గా రాజ్ కిరణ్, నాగర్‌కర్నూల్ కోకన్వీనర్‌గా రమాదేవి, నారాయణపేట కోకన్వీనర్‌గా గోపాల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఉద్యమకారుల సమస్యలపై చర్చించారు.



గద్వాల శివారులో చలిమంటతో కాచుకుంటున్న చిన్నారులు



బల్మూర్- అచ్చంపేట రహదారి కనిపించకుండ కురుస్తున్న మంచు



బల్మూర్ సమీపంలో పొగమంచుతో కమ్మేసిన మొక్కజొన్న పంట



బల్మూరులో ఉదయం 9 గంటలకు కనిపిస్తున్న సూర్యుడు

మంచు కురిసే వేళలో..

ఉమ్మడి జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయాయి.. ఉదయం 8 గంటలైనా మంచు తెరలు వీడటం లేదు.. పొద్దంతా ఉష్ణోగ్రతలు బాగానే ఉంటున్నా.. రాత్రిళ్లు మాత్రం గణనీయంగా పడిపోయి గజగజ వణికిస్తోంది.. గ్రామీణ ప్రాంతాల్లో చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు. మరోదిక్కు ఉదయం 8 గంటల వరకు మంచు కురుస్తుండటంతో వాహనదారులు లైట్ల వెలుతురులోనే రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో ఆదివారం 'మంచుకురిసే వేళలో' పలు దృశ్యాలను 'సాక్షి' కెమెరా బంధించింది.

- గద్వాల అర్బన్/ బల్మూర్

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

మహబూబ్‌నగర్ క్రైం: పొలానికి నీళ్లు పెట్టడానికి మోటార్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని జమిస్తాపూర్ చెందిన శరత్‌కుమార్(19) ఆదివారం ఉదయం తండ్రి గోపాల్‌తో కలిసి గ్రామ శివారులో ఉన్న వరి పంట పొలానికి నీళ్లు పెట్టడం కోసం మోటార్ స్విచ్చాన్ చేసే క్రమంలో షాక్ తగలడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

చారకొండ: గులికల మందు మింగి మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలో నెమలిగుట్ట తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమలిగుట్టతండాకు చెందిన రాత్‌లవత్ బుజ్జి (39) అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 20వ తేదీన గులికల మందు తిని అపస్మారకస్థితిలో పడిపోయింది. స్థానికులు గమనించి కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య తెలిపారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

జడ్చర్ల: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గొల్లపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ కథనం మేరకు.. మిడ్జిల్ మండలం బైరంపల్లికి చెందిన గొడుగు మహేశ్(23) జల్సాగా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం మృతదేహాన్ని గుర్తించామని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వివరించారు.

మృతదేహంతో ఆందోళన..

మిడ్జిల్: పోస్టుమార్టం అనంతరం మహేష్ మృతదేహంతో బైరంపల్లి సమీపంలోని క్రషర్ మిషన్ ఎదుట బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ బంధువులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మూడేళ్లుగా క్రషర్ మిషన్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, శనివారం సాయంత్రం డ్యూటీ ముగిశాక ఇంటికి రాలేదని.. ఆదివారం ఉదయం గొల్లపల్లి సమీపంలో రైలు పట్టాలపై మృతిచెంది కనిపించినట్లు గ్రామస్తులు వివరించారు. యజమానులు అందుబాటులోకి రాకపోవడంతో సాయంత్రం వరకు మృతదేహాన్ని అక్కడే ఉంచారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

నిప్పంటించుకుని వృద్ధుడు..

ఉండవెల్లి: నిప్పంటించుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉండవెల్లి మండలం తక్కశీల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు వివరాల మేరకు.. తక్కశీలకు చెందిన తెలుగు వెంకట్రాముడు (65), లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మూడేళ్ల కిందట వెంకట్రాముడికి పక్షపాతం రావడంతో ఎడమ కాలు, చెయ్యి పడిపోయింది. నెలరోజుల కిందట ఇంట్లో కాలుజారి పడటంతో వెన్నెముకకు గాయమైంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు.. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసు నమోదు

ఉండవెల్లి: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. పోతులపాడుకు చెందిన భానుప్రకాష్, మరో ఇద్దరు టోల్‌ప్లాజా సమీపంలోని బహిరంగ ప్రదేశంలో కారు నిలుపుకొని మద్యం తాగుతున్నారు. పోలీసులు రమేష్, హుస్సేన్ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని.. వెళ్లిపోవాలని కోరగా ఆగ్రహించిన మందుబాబులు దురుసుగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో సిబ్బంది ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

ఊరంతా.. ఊటలే!

భూత్పూర్, నేరడుగం గ్రామాల్లో ఉబికి వస్తున్న నీళ్లు

- భూత్పూర్, సంగంబండ రిజర్వాయర్లతో నిర్వాసితులకు ముప్పు
- రోజురోజుకూ దయనీయంగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మక్తల్: నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల ముంపు బాధితులకు మరో ముప్పు వచ్చి పడింది. ఉబికి వస్తున్న నీళ్లతో కునుకు లేని రాత్రులు గడపాల్సి వస్తోంది. నీటి ఊటలతో నివాసగృహాలు ధ్వంసమై కూలిపోతున్నాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన దుస్థితి నెలకొంది. ఇది మక్తల్ మండలం భూత్పూర్, మాగనూర్ మండలం నేరడుగాం ముంపు గ్రామాల ప్రజల దయనీయ పరిస్థితి. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్యతో సతమతమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

అందని పరిహారం..

2010 నవంబర్ 3న భూత్పూర్‌ను ముంపు గ్రామంగా అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. గ్రామంలో 2,400 మంది జనాభా ఉంది. భూత్పూర్ రిజర్వాయర్‌లో 530 ఇళ్లు, 2,500 ఎకరాలు మునకకు గురవుతాయని అధికారులు గుర్తించారు. ఈ మేరకు అప్పట్లో ప్రభుత్వం తరి పొలానికి రూ.80 వేలు, మెట్టభూమి ఎకరాకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. ఇళ్లు కోల్పోతున్న బాధితులకు నేటి వరకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగడంతో గ్రామంలోకి నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకుసాగని పునరావాసం పనులు..

భూత్పూర్ నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు 2015లో అధికారులు స్థలం ఎంపిక చేయగా.. ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకపోవడం, పునరావాస కేంద్రంలో ఎలాంటి వసతులు లేకపోవడంతో ముంపు గ్రామంలోనే నివాసముంటున్నారు. కొన్ని రోజులుగా రిజర్వాయర్ నీళ్లు ఇళ్లలోకి వస్తుండటంతో నిర్వాసితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



భూత్పూర్‌లో ఉబికి వచ్చిన నీళ్లు



నీటి ఊట కారణంగా తాళం పడిన ఇల్లు

నేరడుగం నిర్వాసితుల గోస..

సంగంబండ రిజర్వాయర్‌కు కట్టకింద ఉన్న నేరడుగాం గ్రామంలో దాదాపు 2,200 మంది జనాభా ఉన్నారు. గ్రామంలో 2,800 ఎకరాలు రిజర్వాయర్‌లో, 300 ఎకరాలు కాల్వల్లో ముంపునకు గురికాగా.. నేటి వరకు నష్టపరిహారం అందలేదు. అదేవిధంగా 746 ఇళ్లు రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్నట్లు అధికారులు గుర్తించి, నంబరింగ్ ఇచ్చారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకుగాను 150 ఎకరాలు అవసరమని తేల్చారు. అయితే నిర్వాసితులకు ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడంతో ముంపు గ్రామంలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు పదేళ్లు గడిచినా భూత్పూర్, నేరడుగాం నిర్వాసితుల సమస్య తీరడం లేదు. తమ గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి..



రోజురోజుకూ భూత్పూర్ గ్రామంలో నివసించే పరిస్థితి లేకుండాపోతోంది. తమకు పునరావాసం కల్పించడంతో పాటు ఇళ్లు, స్థలాలను కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలి. ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ సారించాలి.

- కుర్వ హన్మంతు, సర్పంచ్, భూత్పూర్

ఇళ్లు కూలిపోతున్నాయి..



గ్రామంలో నీళ్లు ఉబికి వస్తుండటంతో ఇళ్లు కూలిపోతున్నాయి. ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామాన్ని ఖాళీ చేయక తప్పని పరిస్థితి ఉంది. అధికారులు గుర్తించిన 530 ఇళ్లకు త్వరగా నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- ఆనంద్ శేఖర్, భూత్పూర్

ప్రభుత్వం ఆదుకోవాలి..



భూత్పూర్ నిర్వాసితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి. గ్రామంలో నీళ్లు ఉబికి వస్తుండడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ప్రభుత్వం పునరావాసం కల్పించాలి.

- ఖతాల్ హుస్సేన్, కోఆప్షన్ సభ్యుడు, భూత్పూర్

కూలుతున్న ఇళ్లు..

సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల కారణంగా నేరడుగాం, భూత్పూర్ గ్రామాల్లో ఎక్కడ చూసినా నీటి ఊటలే కనిపిస్తున్నాయి. నీటి ఊటలతో నివాసగృహాలు కూలిపోతున్నాయి. రోజురోజుకూ నీళ్లు ఉబికి రావడం అధికం కావడంతో ముంపు బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వారి పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. తమను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆందోళనకు చెందుతున్నారు. ఉబికి వస్తున్న నీళ్లతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.



భూత్పూర్‌లో కూలిన ఇల్లు

నకిలీ నారుకు చెక్!

- నర్సరీలపై ఉద్యాన శాఖ ప్రత్యేక నజర్
- రిజిస్ట్రేషన్‌తో నాసిరకం నార్ల విక్రయానికి అడ్డుకట్ట
- అనుమతులు, నాణ్యతా ప్రమాణాలు లేకుంటే చర్యలు
- నర్సరీల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

కల్వకుర్తి టౌన్: ఈ నారు వేయండి.. అధిక దిగుబడితో మంచి లాభాలు వస్తాయి.. అది కాదు, ఈ నారును వాడితే మరిన్ని లాభాలు ఆర్జించవచ్చు.. ఇలా నర్సరీల వ్యాపారులు రైతులకు మొక్కలు, కూరగాయలు, పండ్ల నారు అంటగడుతున్నారు. నారు కొనుగోలు చేసే రైతులకు ఎలాంటి రశీదులు ఇవ్వడంలేదు. కనీసం ఏ కంపెనీ సీడ్స్‌తో నారు పెంచుతున్నారో సైతం తెలియకుండా నర్సరీల వ్యాపారం సాగిస్తున్నారు. నాసిరకం నారుతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ఉద్యాన శాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా వెలుస్తున్న నర్సరీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన నర్సరీలతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై నర్సరీల చట్టం - 2010 ప్రకారం చర్యలు తీసుకోనున్నారు.

పుట్టగొడుగుల్లా నర్సరీలు..

నార్ల పేరుతో గ్రామాల్లో కొనసాగే అంగళ్లలో పెద్దఎత్తున విక్రయిస్తుంటారు. ఇవన్నీ ఎక్కడి నుంచి తెస్తారో, ఎక్కడ తయారు చేస్తున్నారో కూడా తెలియదు. నార్ల విక్రయానికి గాను పుట్టగొడుగుల్లా నర్సరీలు వెలుస్తున్నాయి. అయితే నాసిరకం నారు రైతుల పాలిట శాపంగా మారుతోంది. నర్సరీలను నియంత్రించేందుకుగాను ఉమ్మడి రాష్ట్రంలో నర్సరీ ధ్రువీకరణ, క్రమబద్ధీకరణ చట్టం-2010 తీసుకొచ్చారు. గతంలో ఉద్యాన శాఖ అధికారులు నర్సరీలపై దృష్టి సారించకపోవడం.. సిబ్బంది కొరత కారణంగా పర్యవేక్షణ కొరవడింది. దీంతో కనీస నిబంధనలు పాటించకుండా చాలా నర్సరీలు వెలిశాయి.

పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్..

నర్సరీలు ఏర్పాటు చేసేవారు పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి. అందులో ఎలాంటి రకం ఉద్యాన మొక్కలు పెంచుతున్నది పేర్కొనాలి.

నర్సరీల్లో పాటించాల్సిన జాగ్రత్తలు..

- నారు పెంచే నర్సరీలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు చిల్లులు లేకుండా చూసుకోవాలి.
- షేడ్‌నెట్‌కు 3 అడుగుల విస్తీర్ణం వరకు కలుపు, ఇతర మొక్కలు ఉండకూడదు.
- నర్సరీకి సంబంధించి ఏడు రిజిస్టర్లలో పూర్తి వివరాలు నమోదు చేయాలి.
- నర్సరీ లైసెన్స్ నంబర్, ప్రింట్ బిల్లులు మాత్రమే నారు కొనుగోలుదారులకు ఇవ్వాలి.
- నర్సరీ లోపల పసుపురంగు జిగురు అట్టలు పెట్టాలి.
- నర్సరీ లోపల వైరస్ నిర్మూలనకు చుట్టూ ట్రాప్ - క్రాప్ (బంతి మొక్కలు) వేయాలి.
- నారు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలి.

సరైన నాణ్యతా ప్రమాణాలతో పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, మొక్కల ఉత్పత్తి సరఫరా చేయాలి. చీడపీడలు లేని ఆరోగ్యకర మొక్కల ఉత్పత్తితో పాటు నాణ్యమైన నారును అందించాలి. సంప్రదాయ పద్ధతిలో కాకుండా షేడ్‌నెట్ నర్సరీలు, ట్రేలల్లో ఆరోగ్యకరమైన నారును తక్కువ సమయంలో అందించాలన్నదే ప్రధాన ఉద్దేశమని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.

అనుమతులు తప్పనిసరి..

ప్రతి నర్సరీని రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు రెగ్యులర్‌గా రెన్యువల్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అనుమతులు తీసుకోని వారిపై చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. కొత్త నర్సరీలు ఏర్పాటు చేయాలనుకుంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే అధికారులు రైతులు, నర్సరీల యజమానులను ఈనెల ఖరులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం నర్సరీ ఏర్పాటుచేసే భూమి వివరాలు, నర్సరీ స్టాక్, ఆధార్ కార్డు, యజమాని ఫొటో, రూ.వెయ్యి చలానా చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా నర్సరీలో మట్టి నమూనా రిపోర్టులతో జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న కల్వకుర్తి ఉద్యాన శాఖ అధికారి ఇమ్రానా

నిబంధనలు పాటించకుంటే చర్యలు..

నర్సరీలు ఏర్పాటు చేసే వారు కచ్చితంగా అనుమతి తీసుకోవాలి. జిల్లాలో ఇప్పటికి వరకు 10 నర్సరీలు ఏర్పాటుచేశారు. కొత్తగా ఏర్పాటు చేసే వారితో పాటు పాత నర్సరీల యజమానులు వాటిని రెన్యూవల్ చేసుకోవాలి. అనుమతులు ఉంటేనే నర్సరీల యజమానులు వ్యాపారాలు చేయాలి. లేనిపక్షంలో చర్యలు తప్పవు.

- ఇమ్రానా, ఉద్యాన అధికారి, కల్వకుర్తి

దిగుబడికి కీలకం.. నీటి యాజమాన్యం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్



వేరుశనగలో సాళ్ల విధానంలో నీటితడులు అందించే విధానం



స్ప్రింక్లర్లతో..

అలంపూర్: రైతులు నీటి లభ్యత ఆధారంగా పంటల సాగు చేపడితే లాభసాటిగా ఉంటుంది. సరైన సమయానికి నీటిని అందించక పోతే పెట్టుబడి కూడా చేతికందక అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. యాసంగి సాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందవచ్చని అలంపూర్ ఏడీఏ సక్రియానాయక్ సూచిస్తున్నారు.

నేలను బట్టి నీరు..

భూమిలో నిల్వ ఉండే నీటి పరిమాణం, ఇంకే గుణం వేర్వేరుగా ఉంటుంది. ఉదాహరణకు బంకమట్టి నేలల్లో నీరు త్వరగా ఇంకదు. వీటిలో పత్తి సాగు చేయాలి. ఇసుక నేలల్లో నీరు త్వరగా ఇంకుతుంది. వీటిలో పెసర, మొక్కజొన్న, వేరుశనగ లాంటి పంటలు వేసుకోవాలి. నీటి నిల్వ సామర్థ్యం ఇసుక నేలలతో పోలిస్తే బంకమట్టి నేలల్లో రెండు రెట్లు అదనంగా ఉంటుంది. కాబట్టి బంకమట్టి నేలల్లో నీటి తడులు ఎక్కువ మోతాదు (సుమారు 100-125 మిల్లీమీటర్లు)లో తక్కువసార్లు.. అదే ఇసుక నేలల్లో తక్కువ మోతాదు(సుమారు 50 మిల్లీమీటర్లు)లో ఎక్కువసార్లు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి తడి నీటి మోతాదు ఎట్టి పరిస్థితుల్లోనూ నేల నీటి నిల్వ సామర్థ్యాన్ని మించకూడదు.

నీటిని ఎప్పుడు అందించాలంటే..

ఏ పంట సాగు చేసినా చిన్న మొక్క, పెరుగుదల, పూత, పరిపక్వ, దిగుబడి దశలు ఉంటాయి. ఒక్క చెరుకు మినహా మిగతా పంటలకు పూతదశ అత్యంత కీలకం. ఈ దశలో పంట నీటిఎద్దడికి లోనైతే దిగుబడి 50 శాతానికిపైగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. మొక్క పెరుగుదల, దిగుబడి, నీటిఎద్దడి మధ్యస్త కీలక దశలు, మొక్క చిన్న, పరిపక్వ దశలో నీరందిస్తే లాభం కన్నా నష్టమే ఎక్కువ. పత్తి, వేరుశనగలో విత్తిన 21 రోజుల వరకు నీటిఎద్దడి ఉంటేనే పూత సమంగా వస్తోంది. పరిపక్వ దశలో నీరు ఎక్కువ అందిస్తే మొక్కలు వాలిపోవడం, పంటకాలం పెరగడం, గింజ నాణ్యత కోల్పోతుంది.

పెరగనున్న దిగుబడి..

వానాకాలంతో పోలిస్తే యాసంగిలో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. యాసంగిలో నీటి వినియోగం ఎక్కువ.. వచ్చే దిగుబడి సైతం అధికంగా ఉంటుంది. నిర్దీత మొక్కల సంఖ్య, మబ్బులు లేని వెలుతురు, ఎరువుల వినియోగం యాసంగిలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుతాయి.

పంటలు.. నీటి దశలు

మొక్కజొన్నలో పూత నుంచి గింజ గట్టిపడే వరకు కీలకమైనవి. మొక్కజొన్న, జొన్న, వేరుశనగకు 400 నుంచి 600 మిల్లీమీటర్ల నీరు అవసరం. జొన్నలో చిరుపొట్ట, పూతదశల నుంచి గింజ పాలుపోసుకొనే వరకు కీలకమైనవి. పొద్దుతిరుగుడులో మొగ్గ తొడుగు, పువ్వు వికసించు, గింజ కట్టే దశలు కీలకమైనవి. పెసర, మినుము, పొద్దుతిరుగుడుకు 300 నుంచి 450 మిల్లీమీటర్ల వరకు నీరు అవసరం. మినుములో పూత, గింజ గట్టి పడే దశలో, కందిలో పూత, గింజ తయారయ్యే దశలు, పత్తిలో పూత దశ నుంచి కాయలు తయారయ్యే వరకు కీలకమైనవి.

నీటి సామర్థ్యం పెరగాలంటే..

లోతు తక్కువగా ఉండే ఎర్ర చెక్క నేలలు, అడుగున గట్టిపొర ఉన్న నేలల్లో దున్నడంతో గుల్లబారి వర్షపు నీరు ఇంకుతుంది. లోదుక్కితో మెట్ట పంటల్లో 35 నుంచి 40 శాతం దిగుబడి పెరుగుతుంది. భూమిలో వర్షపు నీరు ఇంకేలా సాళ్లను అడ్డంగా దున్నించాలి. రైతులు సమష్టిగా ఒక ప్రాంతంలో ఒకే రకం పంట వేసేలా నిర్ణయించుకోవాలి. పంటలకు ఏ పద్ధతిలో ఎప్పుడు నీరందించాలనే దానిపై అవగాహన కలిగి ఉండాలి.

మినీ ట్యాంక్‌బండ్‌పై కారు బోల్తా

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై వేగంగా వచ్చిన కారు బోల్తా పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా.. ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులు వేగంగా కారులో వస్తుండగా మినీ ట్యాంక్ బండ్‌పై ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి కారు బోల్తా పడింది. సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న వారు మద్యం తాగి ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంఘటనకు సంబంధించి ఎస్ఐ మహేందర్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

శిశువును గాయపరిచిన ఎలుక: చికిత్స పొందుతూ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఎలుక కరవడంతో గాయపడిన శిశువు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములకు చెందిన శివ కుటుంబం జిల్లాకేంద్రంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో నివాసం ఉంటోంది. శివ దంపతులకు 40 రోజుల క్రితం బాలుడు జన్మించడంతో భార్య, కుమారుడు నాగనూలులోని అత్తగారింటిలో ఉంటున్నారు. శనివారం సాయంత్రం బాలుడి ముక్కును ఎలుక కొరకడంతో తీవ్ర రక్తస్రావమైంది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న శిశువు శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

శాస్త్రోక్తంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం



తిరుమల: శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ముందుగా శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను శ్రీవారి ఆలయం నుంచి శ్రీ భూవరాహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పుష్కరిణిలో ఉదయం 4.30 నుంచి 5.30 గంటల నడుమ స్నపన తిరుమంజనం, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవాన్ని చేపట్టారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణా కరరెడ్డి, బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో 'కూచిపూడి డ్యాన్స్ లెసన్'

గచ్చిబౌలి స్టేడియంలో 3,783 మంది కళాకారుల ప్రదర్శన

గచ్చిబౌలి (హైదరాబాద్): తెలుగు వారి ప్రాచీన నృత్యం కూచిపూడి డ్యాన్స్ లెసన్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. ఏకకాలంలో 3,783 మంది కళాకారులు కూచిపూడి నృత్యంచేసి కళా వైభవాన్ని ప్రపంచానికి చాటారు. ఆదివారం రాత్రి గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం పేరిట లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారు. స్టేడియం నలుమూలలా ఏడు నిమిషాలపాటు కళాకారులు నృత్యంచేస్తూ అలరించారు. గురువు పసుమర్తి శేషబాబు ఆధ్వర్యంలో కళాకారులు ఏకకాలంలో నృత్యం చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అడ్జుడికేటర్ రిషినాథ్ నిర్వాహకులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. 2020లో త్యాగరాయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నైలో ఏకకాలంలో 1,183 మంది కళాకారులు కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారని రిషినాథ్ తెలిపారు. కళలను ప్రోత్సహించి ప్రేరణ కల్గించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలోనే కళలను ప్రోత్సహించే సంఘాలుండాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ కూచిపూడి నృత్యం తెలుగువారికి ఎంతో ఇష్టమైందని, ఈ నృత్యరూపకం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లలిత, వ్యవస్థాపక అధ్యక్షుడు రమణారావు పాల్గొన్నారు.





నృత్యం చేస్తున్న కళాకారులు... గిన్నిస్ రికార్డుతో మంత్రులు జూపల్లి, సీతక్క తదితరులు

పెత్తందారు పైశాచికం!

- జనం మెచ్చిన జగన్ పాలనపై అసూయతో రగిలిపోతున్న రామోజీ
- పరిపాలనకు మానవీయ కోణం.. జనంతో నిరంతరం జగన్ మమేకం
- నేను విన్నాను.. ఉన్నానంటూ ప్రతిపక్షనేతగా నాడు ప్రజలకు భరోసా
- మాటకు కట్టుబడి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేడు పరిపాలన
- సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో సీఎం జగన్
- బాధితులు చెయ్యెత్తితే చాలు.. పిలిచి సమస్య పరిష్కరిస్తున్న సీఎం జగన్
- అనారోగ్య బాధితులకు వెంటనే ఆర్థిక సాయం.. ఆపై ఉన్నత వైద్యం
- అర్హతే ప్రామాణికంగా వివక్ష లేకుండా అందరికీ సంక్షేమ ఫలాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్

క్రిస్మస్ ప్రార్థనల్లో ఏపీ సీఎం జగన్

వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు


సాక్షి కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇడుపులపాయలో ఉదయం 9.10 గంటల ప్రాంతంలో తన తండ్రి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌వద్దకు చేరుకుని నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. తండ్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ బరువెక్కిన హృదయంతో ఘాట్ ప్రాంగణంలో అందరినీ పలుకరిస్తూ ముందుకు కదిలారు. ఇడుపులపాయలోని చర్చిలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి జగన్ కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు.



ఇడుపులపాయ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విజయవాడకు సమీపంలోని పెనమలూరుకు చెందిన ఆటోడ్రైవర్ వెంకట్ (38)కు ఇటీవల ఆకస్మికంగా కాలు, చేయి చచ్చుబడిపోయాయి. విజయవాడలోని యనమలకుదురుకు చెందిన నగరపాలక సంస్థ డ్రెయినేజీ విభాగ ఉద్యోగి రాజేష్ (42) విధుల్లో ఉండగా.. చేయి చచ్చుబడింది. క్షణాల్లోనే గుర్తించిన స్థానికులు వెంకట్, రాజేష్‌లను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తక్షణమే సీటీ స్కాన్ చేసిన వైద్యులు వారు బ్రెయిన్ స్ట్రోక్ బారినపడినట్టు గుర్తించారు. వెంటనే త్రోంబొలైసిస్ ఇంజెక్షన్స్ ఇచ్చారు. వైకల్యం రాకుండా ఇద్దరినీ కాపాడగలిగారు. సాధారణంగా 55-60 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) సంభవించేది. ఇటీవల కాలంలో 45 ఏళ్లలోపు వారిలో ఈ కేసులు అధికమవుతున్నాయి.

యంగ్ స్ట్రోక్



- 30-45 ఏళ్లలోపు వారిలో పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు
- మహిళల్లో హార్మోన్ల ఇబ్బందులతో స్ట్రోక్
- వంశపారంపర్యం, జీవనశైలే కారణమంటున్న వైద్యులు
- స్మోకింగ్, డ్రగ్స్ కూడా స్ట్రోక్‌కు దారి తీస్తున్నాయని వెల్లడి

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఇటీవల కాలంలో స్ట్రోకింగ్ యంగ్ (45 ఏళ్లలోపు వారిలో బ్రెయిన్ స్ట్రోక్) కేసులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిపై వైద్యులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిలకు వస్తున్న వారిలో స్ట్రోకింగ్ యంగ్ కేసులు ఎక్కువగా ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. కదలిక లేని జీవన విధానం.. తీవ్రమైన వత్తిళ్లు.. రక్తం, రక్తనాళాల్లో లోపాలు.. ధూమపానం.. హెరాయిన్ లాంటి మత్తు పదార్థాల వినియోగం.. వంశపారంపర్య కారణాలు 30 ఏళ్లకే బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్నాయి.

25% 'స్ట్రోకింగ్ యంగ్' కేసులే

ఒకప్పుడు వయస్సు 55, 60 ఏళ్ల వారు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యేవారు. కానీ.. ప్రస్తుతం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్న వారిలో 25 నుంచి 30 శాతం మంది 30-45 ఏళ్లలోపు యువతే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వాస్పత్రిలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి ప్రతిరోజూ ఇద్దరు, ముగ్గురు బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్నారు. స్ట్రోక్ తీవ్రతను బట్టి జనరల్ మెడిసిన్, ఏఎంసీ, న్యూరాలజీ విభాగాల్లో చికిత్స అందిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో వస్తున్న వారిలో రక్తంలో గడ్డలు ఏర్పడి మెదడుకు సరిగా రక్తప్రసరణ జరగకపోవడం వలన వచ్చే స్ట్రోక్ (ఇస్కిమిక్) 80 శాతం మంది, రక్తనాళాలు చిట్లిపోయి (హెమరైజ్డ్) 20 శాతం మంది ఉంటున్నారు.

గోల్డెన్ అవర్‌లో గుర్తించడం ముఖ్యం

ఇప్పుడు బ్రెయిన్ స్ట్రోక్‌కు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. లక్షణాలను గుర్తించి.. నాలుగు గంటల్లోపు ఆస్పత్రికి చేరుకుంటే స్ట్రోక్ కారణంగా వైకల్యం బారినపడకుండా వైద్యులు కాపాడగలుగుతున్నారు. ఇస్కిమిక్ స్ట్రోక్ వచ్చిన వారికి త్రోంబొలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తంలోని పూడికలు కరిగేలా చేస్తున్నారు. ముఖం, చేయి, కాలు ముఖ్యంగా శరీరం ఒకవైపున ఆకస్మిక తిమ్మిరి, బలహీనత ఏర్పడటం, ఆకస్మికంగా గందరగోళం ఏర్పడటం, మాట్లాడటం, అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, కంటి చూపు మందగించడం, తల తిరగడం, బ్యాలెన్స్ తప్పడం, ఆకస్మికంగా తీవ్రమైన తలనొప్పి వంటివి బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలుగా వైద్యులు చెబుతున్నారు.

యువకుల్లోనూ కేసులు



ఇటీవల 45 ఏళ్లలోపు యువత బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతోంది. స్ట్రోక్ కేసుల్లో 25% యువతే ఉండటం గమనార్హం. బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడినవారు 4 గంటల్లోపు ఆస్పత్రికి చేరుకుంటే వైకల్యం లేకుండా కాపాడవచ్చు.

–డాక్టర్ దారా వెంకట రమణ, న్యూరాలజిస్ట్, జీజీహెచ్

స్ట్రోక్‌కు కారణాలివీ

పెద్ద వయసుల వారిలో రక్తపోటు, మధుమేహం స్ట్రోక్‌కు కారణమవుతోంది. అయితే.. 45 ఏళ్లలోపు వారిలో హోమోసిస్టీన్, సికిల్ సెల్ అనీమియా, రక్తంలో జన్యుపరమైన లోపాలు, హెరాయిన్ వంటి డ్రగ్స్ వినియోగం, మితిమీరిన మద్యపానం, ధూమపానం, ప్రమాదాల్లో తలకు గాయాలైన వారిలో ఎక్కువగా స్ట్రోక్ వస్తున్నట్టు వైద్యులు చెపుతున్నారు. వీరితో పాటు కదలిక లేని జీవన విధానం కారణంగా కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి స్ట్రోక్‌కు గురవుతున్న కేసులూ ఉంటున్నాయి. మహిళల్లో హార్మోన్స్ ఇబ్బందులు, రక్తనాళాల్లో లోపాల కారణంగా స్ట్రోక్ రావచ్చంటున్నారు. గుండె లోపాలు ఉన్న వారిలోనూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ.

సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి జూపల్లి సమీక్ష



నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: కొల్లాపూర్ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులపై ఆదివారం హైదరాబాద్‌లో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న పనుల పురోగతిని నీటిపారుదల శాఖ ఎస్ఈ విజయభాస్కర్‌రెడ్డి, ఈఈలు శ్రీనివాసరెడ్డి, సంజీవరావులు మంత్రికి వివరించారు. సింగోటం – గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనుల్లో ఆలస్యంపై మంత్రి ఆరా తీయగా.. భూసేకరణలో జాప్యం వల్ల ఆలస్యమవుతుందని అధికారులు తెలియజేశారు. ఈ అంశంపై రెవెన్యూ అధికారులతో మాట్లాడి భూసేకరణలో వేగం పెంచాలని.. భూములు కోల్పోయే రైతులకు న్యాయబద్ధమైన పరిహారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. జీల్దార్ తిప్ప చెరువు అభివృద్ధి, బాచారం హైలెవెల్ కెనాల్, పసుపుల బ్రాంచి కెనాల్ పనులపై జూపల్లి సమీక్ష నిర్వహించారు. ఆయా పనులన్నింటినీ త్వరగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో చివరి ఆయకట్టు కు సాగునీరందేలా చూడాలన్నారు. రిజర్వాయర్లతో పాటు చెరువుల్లో రెగ్యులర్‌గా నీళ్లు నింపాలన్నా రు. త్వరలోనే ప్రాజెక్టుల పనులపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తానని మంత్రి జూపల్లి అన్నారు.

పాలమూరు 'పంచగిరి'



అయ్యప్పకొండపై మణికంఠస్వామి ఆలయం

- సువిశాలమైన ఆహ్లాదకర వాతావరణంలో అయ్యప్ప క్షేత్రం
- 500 అడుగుల ఎత్తులో మణికంఠుడి ఆలయం
- ఉమ్మడి పాలమూరు జిల్లాకే తలమానికం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని అయ్యప్పకొండ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. సువిశాలమైన ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న మణికంఠుడి క్షేత్రం ఉమ్మడి పాలమూరు జిల్లాకే తలమానికంగా నిలుస్తోంది. దాదాపు 500 అడుగుల ఎత్తులో స్వామివారి ఆలయం ఉండటం ఇక్కడి విశేషం. అయ్యప్పకొండపై 1997లో నిర్మితమైన ఆలయం దినాదినాభివృద్ధి చెందుతోంది. భక్తుల కోసం ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేశారు. ఒకేసారి 7వేల నుంచి 8వేల మంది అయ్యప్ప మాలధారులు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు.

1997 నుంచి..

1997లో శిలా విగ్రహంతో గర్భగుడిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దేవాలయంలో పడిపూజలు నిర్వహిస్తున్నారు. అంచెలంచెలుగా ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఒక శిలపై 18 మెట్లను చెక్కి ఏకశిలా దివ్యపడునెట్టాంబడిని ప్రతిష్ఠించారు. అదే విధంగా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను ప్రారంభించారు. ఆరేళ్ల నుంచి అయ్యప్పకొండ వద్ద మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఏడాది నవంబర్ 16 నుంచి డిసెంబర్ 31 వరకు భిక్ష ఏర్పాటు చేస్తుండగా.. 250 నుంచి 300 మంది స్వాములు స్వీకరిస్తారు.


అందరి సహకారంతో..



దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో అయ్యప్ప స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. మొదట్లో కొండపై నడవడానికి కూడా బాట ఉండేది కాదు. ఇప్పుడు అయ్యప్పకొండపై అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. ప్రతి ఏడాది అయ్యప్ప పడిపూజను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పడిపూజ రోజు అయ్యప్ప స్వాములచే రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నాం.

– సీఆర్ భగవంతురావు, అధ్యక్షుడు, అయ్యప్ప సేవా సమాజం

అయ్యప్ప సేవలో..



నేను 36వ సారి అయ్యప్ప దీక్ష చేపట్టాను. అయ్యప్ప ఆలయం ప్రారంభమైనప్పటి నుంచి స్వామివారి సేవలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి.

– పంబరాజు గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి, అయ్యప్పసేవా సమాజం

నేడు మహా పడిపూజ..

అయ్యప్పస్వామి ఆలయ 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అయ్యప్ప సేవాసమాజం ఆధ్వర్యంలో సోమవారం మహా పడిపూజకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 నుంచి 8.30 గంటల వరకు సుప్రభాత సేవ, గణపతి, నవగ్రహ హోమం, నిత్యాభిషేకం పూజలతోపాటు రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక తూర్పు కమాన్ వద్ద గల రామాలయం నుంచి కలశాలు, స్వామివారి పల్లకీ సేవ ప్రారంభమై.. పట్టణ ప్రధాన రహదారుల మీదుగా అయ్యప్పకొండ వరకు కొనసాగుతుంది. పల్లకీసేవలో వేలాదిమంది అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొంటారు. 10 గంటలకు అష్టాభిషేకం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి 7.30 గంటలకు తిరుపతికి చెందిన వెంకటేశ్వరశర్మ, చంద్రమౌళి శర్మ, పాలమూరు పట్టణ గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

సంక్రాంతికి 'స్పెషల్'

- ఆర్టీసీ రీజియన్ నుంచి 420 అదనపు బస్సు సర్వీసులు
- జనవరి 7నుంచి అందుబాటులోకి..
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల ఏర్పాటు



గతేడాది సంక్రాంతి పండుగ సందర్భంగా రద్దీగా ఉన్న మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ (ఫైల్)

స్టేషన్ మహబూబ్‌నగర్: పల్లె సంస్కృతిని ప్రతిబింబించే పండుగ సంక్రాంతి. దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారితో పాటు గ్రామికులు, విద్యార్థులు స్వగ్రామాలకు వచ్చి మూడు రోజులు నిర్వహించే పండుగ సంబరాల్లో పాల్గొని వెళ్తుంటారు. వీరి రాకపోకలకు అవసరమైన బస్సులను అందుబాటులో ఉంచేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికుల సౌకర్యార్థం మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని 9 డిపోల నుంచి 420 అదనపు బస్సు సర్వీసులను నడిపేందుకు ప్రణాళిక రూపొందించింది. వచ్చేనెల 7నుంచి 15వ తేదీ వరకు అదనపు బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు ఎక్కువ సంఖ్యలో అదనపు సర్వీసులు తిరగనున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

డిపోల వారీగా అదనపు బస్సు సర్వీసుల వివరాలిలా..

డిపో	అదనపు సర్వీసులు
మహబూబ్‌నగర్	59
వనపర్తి	58
షాద్‌నగర్	57
గద్వాల	48
నారాయణపేట	45
కొల్లాపూర్	41
నాగర్‌కర్నూల్	38
కల్వకుర్తి	39
అచ్చంపేట	35

ఏపీలోని పలు ప్రాంతాలకు..

ఏపీలోని పలు ప్రాంతాలకు అదనపు బస్సులు (సూపర్ లగ్జరీ) నడపనున్నారు. మహబూబ్‌నగర్ నుంచి బస్సులు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌కు వెళ్తాయి. అక్కడి నుంచి రాజమండ్రి, అమలాపురం, విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ తదితర దూర ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం..



సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని డిపోల నుంచి అదనపు బస్సు సర్వీసులు నడపనున్నాం. దూర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రయాణికుల రద్దీ మేరకు మరిన్ని బస్సులు నడపడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

– వి.శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం, మహబూబ్‌నగర్

రాచూరులో పురావస్తుశాఖ పరిశోధకులు

వెల్దండ: మండలంలోని రాచూర్‌లోని హన్మాన్, శివాలయం, భైరవ తదితర దేవాలయాలను పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ శివనాగిరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో ఉన్న శిలలను పరిశీలిస్తే ఏళ్ల క్రితానివిగా ఉన్నాయని తెలిపారు. ఆలయాల్లో పూడుకుపోయిన శాసనం, రాతి కలశం, సప్తమాతల శిల్పం, భిన్నమైన భైరవ విగ్రహాలు, త్రికూటాలయం, పోషమ్మ దేవాలయం తదితరవి పరిశీలించినట్లు పేర్కొన్నారు. రాచూర్‌కు వెయ్యి ఏళ్ల చరిత్ర ఉందని ఆయన వివరించారు. పూర్వంలో ఇక్కడ రాజులు ఉన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని వివరించారు.

గ్రామానికి మరోపేరు..

దేవాలయాల్లో లభించిన శాసనాలను పరిశీలిస్తే రాచూర్ గ్రామానికి మరో పేరు రావితొర్రు, రావితొరుతి అని ఉన్నట్లు పరిశీలకులు వివరించారు. ఇక్కడ క్రీ.శ. 1137 ఫిబ్రవరి21 నాటి కల్యాణి చాళుక్య మూడో తైలపుని శాసనం, క్రీ.శ 1157 డిసెంబర్ 27 నాటి కందూరు చోళ రాజు రెండో ఉదయాదిత్యుని శాసన, అతని క్రీ.శ. 1159 అక్టోబర్ 24, క్రీ.శ. 1160 సంవత్సర శాసనాలు ఉన్నాయని తెలిపారు. స్థానిక కేశవ దేవరకు, పానగల్లులోని సోమనాథ దేవాలయంలోని కేశవ దేవర దీపాలకు స్థానిక మల్లిశెట్టి, భూమి, మేకలు దానం చేసిన వివరాలున్నాయన్నారు. చారిత్రక ప్రాధాన్యత గల శిల్పాలు, శాసనాలపై వేసిన రంగులు తొలగించి, శిథిలమైన ఆలయాలను పదిలపరిచి, భావితరాలకు అందించాలని తెలిపారు. అనంతరం ఆలయాల్లో లభించిన ఆధారాలను సేకరించినట్లు పేర్కొన్నారు.



రాచూర్‌లో శిలలను పరిశీలిస్తున్న పురావస్తు పరిశీలకుడు శివనాగిరెడ్డి

జాతీయస్థాయిలో చాంపియన్‌గా నిలవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీలో తెలంగాణ జట్టు మెరుగైన ప్రతిభకనబరిచి చాంపియన్‌గా నిలవాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. తమిళనాడులోని త్రిచిరపల్లిలో మంగళవారం నుంచి 30 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు ఆదివారం తరలి వెళ్లింది. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర జట్టును రమేశ్‌బాబు అభినందించారు. జిల్లా వాలీబాల్ సంఘం సహకారంతో తెలంగాణ బాలికల జట్టుకు వారం రోజులపాటు ప్రత్యేకంగా కోచింగ్ ఇచ్చినట్లు చెప్పారు. టోర్నీలో విజేతగా నిలిచి రాష్ట్రానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా వాలీబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ హనీఫ్, కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి వేణుగోపాల్, పర్వేజ్‌పాషా, బాలరాజు, ముస్తఫా, దస్తగిరి పాల్గొన్నారు.



తెలంగాణ బాలికల వాలీబాల్ జట్టుతో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

తెలంగాణ బాలికల వాలీబాల్ జట్టు...

అమూల్య, టి.సంజన (నిజామాబాద్), ఎం.రవీనా (కామారెడ్డి), ఆర్.శ్రీజన (నల్లగొండ), హాసిని, శ్రీనిధి (మేడ్చల్), ఎం.సంగీత (హన్మకొండ), సమీనాబేగం (మహబూబ్‌నగర్), కేతన (హైదరాబాద్), అర్చన (రాజన్న సిరిసిల్ల), అంబిక (ఖమ్మం), అక్షయ (మెదక్), కోచ్‌గా మమత (పీఈటీ చిన్నచింతకుంట), మేనేజర్‌గా ముస్తఫా (పీఈటీ మహబూబ్‌నగర్), హెచ్ఓడీగా పర్వేజ్ పాషా వ్యవహరిస్తారు.